


## శ్రీ రామమూర్తి

చింతలపాలెం. చిన్న గ్రామమైనా వున్న నాలుగిండ్ల వాళ్లూ కలసి ఆందోళన సల్పి బోర్డువాళ్ళతో పోట్లాడి ఆవూళ్లో కూడా ఒక ప్రాథమికపాఠశాల యేర్పాటు చేయించారు. రామయ్యపంతులుగారే 'అక్కడ మొట్ట మొదటినుంచీ వుపాధ్యాయులుగా వున్నారు. ఆ బళ్లో అందరూ సక్రమంగా హాజరైతే పదిహేనుమంది పిల్లలుంటారు - అందులో సాధారణంగా సగంమందికిపైగానే యెప్పుడూ హాజరుకారు లేండి - అందుచేత పంతులు రామయ్యగారికి అట్టే పనియేమీ యెక్కువగా వుండేది కాదు. మనోవిశేషం పంతులుగారి బసా పాఠశాలా ఒక యింట్లోనే కాబట్టి బడికి పోవడం రావడం అనే శ్రమ కూడా తప్పిపోయింది పంతులుగారికి. బడిమాత్రం ప్రతి రోజూ తెరిచేవుంటుంది. ఉదయం యేడుగంటలు మొదలు పదింటివరకూ సాయంత్రం రెండు మొదలు అయిదుగంటల వరకూ పిల్లలకు చదువుచెప్పినా చెప్పకపోయినా పంతులు కూడా తప్పకుండా హాజరుగా వుంటాడు తనమామూలు మేజా కెదురుగా కుర్చీమీద కూచోని కాని అందులో యెవరు యేమిచేసేదీ యెవరికీ తెలియదు - తెలుసుకుందామనే ఆసక్తికూడా యెవరికీవున్నట్టు కాన్పించదు ఆవూళ్లో. మనవూళ్లోకూడా ఒడి వున్నది – మనవాళ్లుకూడా బడికి పోతున్నారు కదా అనే సంతోషంతోనే సంతృప్తులయినారు ఆ వూరి పెద్దలందరూ.

రామయ్యపంతులు యీ కాలం పంతుళ్లవంటివాడు కాడు. వొట్టి అమాయికుడు. కల్లా కపటంయెరుగని నిష్కళ యోగ్యుడు. అసలు ఆయనకీ కలికాలంలో తావేలేదు, సృష్టికర్త యెట్లా పొరపడ్డాడో కాని, యీ చాదస్తం పెద్దమనిషిని భూపతనం చెయ్యడానికి.

వివిధ కళలలోనూ, శాస్త్రాలలోనూ అపారపాండిత్యము గడించి మహా మేధావులని ప్రసిద్ధిజెందిన పలువురు మహా పురుషులకు జన్మస్థానమైన రాజమహేంద్రవరం పంతులుగారి జన్మభూమి. ఉద్భవించింది యీవదాంధ్ర దేశంలోనూ లౌకిక వ్యవహారధురీణులని పేర్వడసిన నియోగి బ్రాహ్మణవంశము. అయితే యేమి? ఆ జన్మస్థానవాసిగానీ వంశవాసిగాని మనపంతులవారికి యీమాత్రం సంక్రమించలేదు. కాని యేదో కాస్తా కూస్తో పాండిత్యంమాత్రం అబ్బింది - కవిత్వంకూడా చెప్పగలడు. ఇక యింగ్లీషు రాకపోతేమాత్రం ఏమీ? ఒకవేళ చదువు చట్టుబండలయి వొచ్చినా రాకపోయినా - నలుగురిలో తిరిగి నాలుగుచోట్ల నాలుగు మాటలు మాట్లాడి నాలుగు డబ్బులు సంపాయించుకునే జ్ఞానమయినా లేదు మనపంతులుగారికి. ఎంతసేపూ తనపుస్తకాలేమో, తానేమో. ఇతర ప్రపంచంతో అవసరమే వుండదు ఆయనకు. బయటికిపోయి నలుగురు పెద్దమనుష్యులతో కలసి మాట్లాడడం యేమీలేదు. ఎవరైనా పిలిస్తే పలుకుతాడు లేకపోతే లేదు. అడవి

చిత్రమో, ఆయనకు అసలు ఒకరితో మాట్లాడడమంటేనే యేమో కష్టంగా వుంటుంది. అందుచేత ఆవూళ్ళో అయిదారేండ్లబట్టీ వుంటున్నాగాని ఆయన యెవరితోనూ స్నేహమంటూ చెయ్యలేక పోయినాడు. తనయింట్లో పాచిపని చేసే లక్ష్మితప్పితే పంతులుగారికి ఆవూళ్లో మరెవళ్లూ పరిచితులు లేరు మంచీ చెడ్డా మాట్లాడుకోడానికైనా.

నలభై యేండ్లకు పైబడి వుంటుంది పంతులు వయస్సు. ఇంకా పెండ్లి చేసుకోలేదు - అసలు చేసుకుంటాడో లేదో వొంటరిగానే వుంటూవున్నాడు. స్వయంగా వంటచేసుకొని భోంచేస్తాడు. ఆయన భుజించిన పిదప భుక్తావశేషమును లక్ష్మికి పెట్టేవాడు రేపూ మాపూకూడ.

లక్ష్మి అనాథబాలిక ఏవైపుజూచినా నా అన్నదిక్కు లేదు. తండ్రిని ఆవిడ యెరుగనే యెరుగదు - తల్లి మూడేండ్ల క్రితం చనిపోయింది. ప్రస్తుతం పంతులుగారే ఆవిడకు తల్లీ దండ్రీ కూడా - బళ్లో అక్కడా పాచిపని చేస్తూ పంతులు పిలిచినపుడల్లా ఆపనికీ యీపనికీ పలుకుతూ ఆయన పెట్టిన వేళకు రెండుమెతుకులు తిని అక్కడనే కాలక్షేపం చేస్తూవుంది.

తల్లి చనిపోయిన యీ మూడేండ్లబట్టీ అసలు మొట్టమొదట ఆ పిల్ల తల్లి అక్కడ దాసీగా పనిచేస్తూవుండేది. తల్లితోపాటు వస్తూ పోతూ వుండడంచేత పంతులుగారితో పరిచయంకలిగింది లక్ష్మికి. పంతులుగారికి పసిపిల్లలంటే ఎంతో ప్రేమ. అందులో ఆ పిల్ల గొల్లదయినా చక్కని చుక్కలాగు చూడడానికి ముచ్చటగా వుండేది. ఆ ముద్దుమాటలూ - ఆ చాకచక్యమూచూచి ముగ్ధుడయిపోయి పంతులుగారు ఆ పిల్లకు వొచ్చినప్పుడల్లా పిప్పరమెంట్లూ, బిస్కత్తులూ, యిచ్చేవాడు. ఎంతో ఆదరణతో ఆ పిల్లను దగ్గరకు పిలిచి మాట్లాడించి ఆనందించేవాడు. అందరు పిల్లలతోపాటు లక్ష్మికూడా బడికివచ్చి కూర్చునేది. అందరికివలె ఆ పిల్లకుకూడా చదువుచెప్పేవాడు పంతులు.

అయితే ఆపిల్ల అందరివెంబడి యింటికి పోయేదికాదు. పంతులు ప్రత్యేకంగా పిలిచి "లక్ష్మి యింక మీ అమ్మదగ్గరికిపో!" అని చెప్తేనే పోతుంది, లేకపోతే అట్లాగే కూచుని వుండేది యెంతసేపయినా.


పాపం! తొమ్మిదేండ్లు దాటకముందే తల్లి చనిపోయింది లక్ష్మికి. అదిమొదలు తల్లీ దండ్రీ ఆవిడకు పంతులుగారే. కన్నబిడ్డకంటే యెక్కువ గోముగా పెంచుతూ వున్నాడు. మూడేండ్లయింది ఆయనపోషణలో వుండబట్టి, ఎప్పుడూ ఆయనదగ్గరనే వుంటూ వుండడంచేత పంతులు తనకు యేమీ తోచనప్పుడల్లా లక్ష్మికి పాఠాలుచెప్పడంతో కాలంగడిపేవాడు. ఆ విడకు చదువుచెప్పడమంటే ఆయనకు "హాబీ" అయిపోయింది. లక్ష్మికికూడ చెప్పిన పద్యం వ్రాసేఅంత భాషా పాండిత్యం అబ్బింది.

బడి వూరికి కొంచం కడవాటుగా వుంటుంది. గోదావరీ పంటకాలువ ఆనుకొని, తూర్పు పడమర నాలుగుదూలాల కొట్టం. సజ్జచొప్పతో కప్పారు అయిదారు సంవత్సరాల క్రిందట - ఆ పై కప్పుకూడా యిప్పుడు సరిగాలేదు. తలవాకిలి తూర్పుముఖంగా వుంది. ఇల్లానుకొని వున్న పెరట్లోకి పోవడానికి పశ్చిమదిశను మరోద్వారంవుంది. దక్షిణపు చివర రెండంకణాలు మధ్య తడికఅడ్డం కట్టుకొని పంతులుగారు వంటకూ దానిని వుపయోగించుకుంటాడు. మిగత బడిక్రింద వాడబడుతూవున్నది. బయటివసారాలో ఒక మూల లక్ష్మిమల్లా ముంతా, గుడ్డా గుడుసులూ పెట్టుకుని వుండేది.

ప్రతిరోజూ సాయంత్రం బడివిడిచిన తరువాత పంతులు యింటివెనుక పెరటితోటలో వుండే పూలమొక్కలమధ్యన కుర్చీ వేసుకొని కూచునేవాడు. అక్కడికి కనబడుతూవుండే కాలువనీటి ప్రవాహమును, తత్తీరమందలి వృక్షముల రమణీయకమును కనులారగాంచి ఆనందించేవాడు. అప్పుడు లక్ష్మి పూలచెట్లకు నీళ్లుపోయడానికి వొచ్చేది. పంతులు పాదులు సరిచేస్తూ కయ్యలు గడుతూ వుండేవాడు. ఏ చెట్టుకు యెన్నినీళ్లు పోయవలెనో దేని నెట్లా కాపాడవలెనో ఆ విడకు బోధించేవాడు. ఆవిడా శ్రద్ధగా విని నేర్చుకుంటూ వుండేది.

ఆ సాయంసమయ సంధ్యారాగమున ప్రకృతి శోభను తిలకించినప్పుడూ, కమ్మని తావులను చల్లని పిల్లగాడ్పులు సోకి మేను పులకరించినప్పుడూ, మహీరుహదళములు కదలునప్పుడూ, అనంతాకాశమందు నీలమేఘములు చలించు

నప్పుడూ అతని కపరిమితానందము గలిగి మనోహర భావాలు దోచేవి. ఆయనపూర్వభావాలను తన కవిత్వమున చిత్రించేవాడు వెంటనే - ఆ పద్యాలు లక్ష్మియే వ్రాస్తూ వుండేది.



ప్రతి సాయంత్రమూ పూరిండ్లనుండీ సుళ్లుతిరుగుతూ లేచే పొగను చూచీ గూళ్లకుచేరే శకుంతసంతానముల కిలకిలారావములు వినీకాని తనయింట దీపమును వెలిగించేవాడు కాడు పంతులుగారు. దీపమును వెలిగించిన వెంటనే "లక్ష్మి" అని పిలిచేవాడు. అతని పిలుపుకు కనిపెట్టుకుని వసారాలో కూచునివుండే లక్ష్మి "నన్ను పిలిచారా బాబూ!" అని అడిగేది లోపలికివొస్తూ. పంతులు "ఏం జేస్తూన్నావు? అదుగో ఆ టేబులుదగ్గిరి గూట్లో చుట్టలున్నాయి, వొక టిలా పట్టుకరా?" అనేవాడు. లక్ష్మి చుట్టతెచ్చి యిచ్చిన తరువాత దాని కాలుస్తూ ఆవిడతో సావకాశంగా కబుర్లు చెపుతూ వుండేవాడు. ప్రసంగ సందర్భంలో లక్ష్మి తల్లి దండ్రులనుగూర్చి, అన్నదమ్ములను గురించీ, వాళ్లు చనిపోయిన విధమునూ "నీకు జ్ఞాపకమున్నదా" యని గుచ్చి గుచ్చి అడిగేవాడు. లక్ష్మి విస్మరించిన గతమును స్మరణకు తెచ్చుకొని కన్నీళ్లు రాల్చి కొంతసేపు దుఃఖించేది. తల్లిదండ్రులు, అన్నదమ్ములూ వున్నప్పుడు సుఖముగా తాను గడిపినకాల మాపిల్లకు జ్ఞాపకం లేక పోలేదు. ప్రేమ పూరితములయిన వాళ్ల మాటలూ ఆదరణా స్మృతికి తెచ్చుకొంటూ వాళ్ల రూపాలు మనఃపటమునందు చిత్రించుకుంటూ తన్నుతాను మరచిపోయేది తరువాత యెంతోసేపటికి పంతులు లేచి భోజనం చేసి ఆ విడకు అన్నం పెట్టేవాడు.

అది వొకనాటి మధ్యాహ్నము. వర్షం కురిసి వెలిసింది. చల్లని పిల్లగాలులు వీలుతున్నవి. ఆ తొలకరి వానకు ఎండిన ఆకులమీదా మరిగిన భూమిమీదా కమ్మని తావులు బయలుదేరినవి-అలసిన భూకాంత వేడి నిట్టూర్పులో యనున్నట్లున్నవి. మహీరుహముల నధిరోహించి శకుంత సంతానములు ప్రకృతిశోభగును వర్ణించుచున్నట్లు శ్రావ్యమైన ధ్రువాగాన మొనరిస్తూన్నవి.

అప్పడే భోంచేసి తీరికగా కూచున్న పంతులు వర్షస్నాతములైన పండుటాకుల కాంతిని చెదిరిపోయి మళ్లీ గుంపవుతూన్న మేఘాలరామణీయకమునూ మబ్బుల మరుగున తిరుగుతూ మధ్యమధ్య తొంగిచూచే సూర్యునిసౌరూ

తిలకిస్తూ "ఆహా! యీ సమయంలో ప్రక్కన యెవరైనా స్నేహితులుంటే యెంత బాగుండేది. ఆ పక్షులకూతల కదేగావును అర్థం. అందుకే ఆ ఆకులుకూడా మర్మర ధ్వనులుచేస్తూన్నట్టుంది ?" అని అనేకవిధముల వితర్కిస్తూ" లక్ష్మి అని బిగ్గరగా పిలిచాడు. పెరటితోటలో వర్షానికి చెట్లుక్రింద యేమైనా పండ్లురాలినవేమోనని చూస్తూన్న లక్ష్మి పంతులుగారి పిలుపువిని పరుగెత్తుకుంటూవచ్చి "బాబూ! నన్ను పిలిచారా!" అని అడిగింది. "నీకు పాఠంచెబుతాను రా" అని దగ్గర కూచోబెట్టుకొని భారతంచెప్పడం మొదలుపెట్టారు. ఆవిడ శ్రావ్యంగా పద్యాలు చదువుతూంటే తానెంతో అప్యాయనంగా వినేవాడు. ఆవిడ మనోహరంగా అర్థంచెప్పుతూంటే ఆలకించి ఆనందించేవాడు. ముద్దులుగులుకు మాటలతో ప్రశ్నలవేస్తే పులకితగాత్రుడై జవాబుచెప్పేవాడు. తన కుర్చీపక్కన కూచొని ప్రాప్తయౌవనయైన లక్ష్మి తలవొంచి పాఠం చదువుతూవుంటే ఆమె సహజసౌందర్యమును కనులార గాంచి, ఆ అమాయికత్వము తలచుకొని, భావిస్థితి నూహించుటలో లీనమయి పోయేవాడు. నిద్రపోయినాడేమోనని చదవడం చాలించేది లక్ష్మి. ఇటువంటి సంఘటనాలు తరుచు సంభవిస్తూండేవి.

అది వర్షాకాలము. రాత్రింబగళ్లూ విధీ విరామంలేకుండా జోరున వాన కురుస్తున్నది. నిరంతరం వర్షధ్వనీ పిడుగుల రొదా, కప్పల బెక బెకలూ తప్ప రెండో ధ్వని వినరావడంలేదు. గ్రామంఅంతా నీటిమయమై పోయింది.

ఉదయమే నిద్రలేచిన లక్ష్మి బయటి వసారాలో కూచుని మేఘాచ్ఛాదితమైన ఆకాశమును చూచి ఆనందిస్తూ, గురువుగారు ఎప్పుడు పిలుస్తాడోనని కాచుకొని వున్నది. ఎంతసేపటికీ పిలుపురానందున తానే నెమ్మదిగా గురువుగారి గదిలోనికిపోయి పండుకునివున్న పంతులును జూచి నిద్రపోతున్నాడని కాలిచప్పుడు కాకుండా మరలిపోతూవున్నది. పంతులావిడనుచూచి "లక్ష్మి" అని పిలిచాడు "బాబూ! నిద్రపోతూన్నారా పోండి" అన్నది. పంతులు "లక్ష్మి నాకు వొళ్లు సుస్తీగావుంది. నావొళ్లు తాకిచూడు వెచ్చగా వున్నదేమో ?" అని అడిగాడు;

లక్ష్మి పంతులుగారివొళ్లు పట్టిచూచింది. జ్వరం తీవ్రంగానే తగిలింది. పాపం! ఆ విదేశవాసి కావిడతప్పితే యిక్కడ దిక్కెవ్వరు ? బాల్యమాదిగ పరిచారికయై శిష్యురాలయివున్న లక్ష్మి ఆ కష్టసమయంలో ఆయనకు ఆశాభంగము కలుగకుండా తనకర్తవ్యము నూహించి డాక్టరును పిలిపించింది. డాక్టరు రోగిని పరీక్షించి రోగమునకు తగిన ఔషధమునిచ్చి దాన్ని ఎట్లా వాడవలసింది లక్ష్మికి చెప్పి వెళ్లాడు.

ఆవిడ వైద్యుడుచెప్పిన ప్రకారం సకాలానికి మందిస్తూ వుండేది. శ్రద్ధగా పథ్యం పానం విచారించేది. రాత్రింబగళ్లూ ప్రక్కదగ్గర కూచొని పరిచర్యచేసేది పంతులు గారికి. అప్పుడప్పుడు "బాబూ! ఎట్లావుంది, ఏమైనా కొంచెం నయమేనా ?" అని, అడుగుతూ వుండేది.

ఈజబ్బు చాలారోజులు బాధించింది, పాపం! పంతులు రామయ్యను. అతడు తిరిగీ ఆరోగ్యవంతుడయ్యేవరకు చాలా కాలం పట్టింది. ఆవూళ్లో వుండడమంటే అతనికి విసుగు పుట్టింది. "ఇక యీవూళ్లో వుండలేననుకున్నాడు. వెంటనే నన్ను యింకోవూరికి మార్చవలసిందని బోర్డువారికి విజ్ఞాపం పంపుకున్నాడు.

పంతులు ఆరోగ్యవంతుడైనాడు. మళ్ళీ మామూలు ప్రకారం అన్నిపనులూ జరుగుతూన్నవి. లక్ష్మికి యెక్కువ చనవూ, స్వాతంత్ర్యమూ అయాచితముగా యిచ్చాడు పంతులు.

కొన్నిమాసములు గడచినవి.

ఒకమని మాపు: యథాప్రకారం పంతులు యింట్లో దీపంవెలిగించి "లక్ష్మి" యని పిలిచాడు. లక్ష్మి సంతోషంగా లోపలికివచ్చి "బాబూ నన్ను పిలిచారా ?" అని అడిగింది.

పంతులు "అవును; రేపు నేను వూరికి పోతున్నాను." అన్నాడు.

లక్ష్మి:—ఏవూరికి పోతారు ?

పంతు:— మా స్వగ్రామానికి.

లక్ష్మి:—అయితే - మళ్ళీ యెప్పుడువస్తారు ?

పంతు:—ఇక - తిరిగీ - యీ వూరికి రాను.

లక్ష్మి మరి మాట్లాడలేదు. అయినా పంతులుమాత్రం వూరుకోలేదు. "నాకు యీవూళ్లో వుండడం యిష్టంలేక మరోవూరు మార్చమని పై యధికార్లకు వ్రాశాను. కాని వాళ్లు నన్ను బదిలీచేయడానికి సమ్మతించలేదు. కాబట్టి

నే నీ వుద్యోగమే మానుకొని పోతూవున్నాను” అని చెప్పాడు. కాని లక్ష్మి కామాటలు వినబడలేదు. ఆవిడకు గుండెల్లో రాయిపడ్డట్టయింది. హృదయంలో ఆవేదన కలిగింది. బాహ్యప్రపంచమునే విస్మరించింది. తరువాత చాలాసేపు వాళ్లిద్దరిలో యెవరూ మాట్లాడలేదు. ఆచిన్న లాంతరులోని సన్నని దీపంమాత్రం మిణుకు మిణుకుమంటూ వెలుగుతూ వున్నది. ఇంటి పైకప్పులోని సన్నని రంధ్రాల గుండా తొంగిచూస్తూన్న తారకలు వారి మనోభావముల నూహించలేక తెల్లబోయినట్లున్నవి.

తరువాత కొంతసేపటికి పంతులుగారు భోంచెయ్యడానికి లోపలికి వెళ్లారు

లక్ష్మిమాత్రం అక్కడే వున్నది. ఆలోచించవలసిన అనేకవిషయాలామె మనోదృష్టికి గోచరిస్తూన్నవి. ఆమె వూహా ప్రపంచంలో భావతరంగాలు ఒకదాని వెంట నొకటి పరుగిడుతున్నవి.

ఇంతలో పంతులు లక్ష్మిని భోజనానికి పిలిచాడు. ఇంకా ఆవిడ మనోభావాలు నిశ్చలములుగాలేదు. మనస్సు కుదుటబడలేదు. అన్నముమీది ధ్యాసయే తప్పిపోయింది. ఏదో రెండు మెతుకులు యెంగిలిపడ్డది. తాను చేయవలసిన పనులు - అంట్లుతోమడం ఆదీ - ముగించింది తొందరగానే. పడక కుర్చీమీద పండుకుని చుట్టతాగుతున్న పంతులుగారి దగ్గరకు వొచ్చి నిలుచుని “బాబూ! నన్ను మీ వెంట తీసుకొని పోతారా లేదా?” అని అడిగింది, జాలిపుట్టేలాగు. పంతులు నవ్వుతూ “ఏమికోరికకోరావు” అన్నాడు. ఆమెకోరిక “అందనిమాని పండ”ని అతనికి తోచింది. అందుకు సరియైన జవాబు చెప్పవలెనని అతనను కోలేదు. అనుకున్నా యేమని జవాబుచెప్పగలడు? తన వెంట తీసుక పోతానంటాడా? యౌవ్వనవతియగు నొక స్త్రీని-అందులో స్వకులజకానిదాన్ని వెంటనిడుకొని స్వగ్రామమునకు పోతే గౌరవముంటుందా? అందులో అతను బ్రహ్మచారి అయినందువల్ల అనుమానమున కెక్కువ అవకాశమున్నది కూడా తానెంత యోగ్యుడైనా లోకము నమ్ముతుందా? లోకులు పలుగాకులు గదా? వూరుకుంటారా? ఒకసంఘములో నున్నపుడు ఆ సంఘపు కట్టుబాటుల నతిక్రమించి యేవ్యక్తియైనను గౌరవమును దక్కించుకొనగలడా? అని పంతులు అనేక విధములయిన ఆలోచనలకు లోనయినాడు. పంతులుగారి పరిహాస ప్రత్యుత్తరం లక్ష్మి మనస్సు కలంచివైచింది. రాత్రి నిద్రపోయినా మేలుకున్నా “ఏమికోరిక కోరావు” అను పంతులుగారి వాక్యమే ఆవిడ శ్రవణకుహరాల్లో ప్రతిధ్వనిస్తూ మనస్సును పరితపింప జేసింది.

మరునాడు వుదయం కొత్తపంతులు వొచ్చాడు. అతనికి ‘ఛార్జి’ వొప్పజెప్పి రామయ్యపంతులు ప్రయాణసన్నద్ధుడై లక్ష్మిని పిలిచి, ప్రేమపూరిత హృదయముతో జాలిగొలుపు మాటలతో “అమ్మాయీ! నేను పోయివచ్చెదను నీవు విచారపడవొద్దు. నీ విషయం క్రొత్త పంతులుగారితో చెప్పాను. ఆయన నిన్ను ఏలోటూ రాకుండా కాపాడగలడు. యిదుగో యీ పది రూపాయలూ తీసుకో నీకు శుభమవుతుంది. “అని చెప్పలేక చెప్పినాడు ఇంతవరకూ పంతులుగారి ముఖము రెప్ప వాల్పక తదేకదృష్టితో చూస్తూన్న లక్ష్మి గద్గదస్వరంతో “నన్నుగురించి మీ రెవరితోనూ చెప్పనవసరంలేదు. మీరు లేనినాడు నా కీ ప్రపంచమే లేదు. కాబట్టి నాకేమియూ మీరీయ నక్కరలేదు?” అంటూ పంతులుగారి పాదముల కెఱగి కన్నీటిచే కడిగింది. కరుణార్ద్రగక్షతల జల్లుతూ “సుమంగళీభవా” యని దీవించి రాజమండ్రి రైలుకు బయలుదేరాడు - రైల్లో కూచున్న రామయ్యపంతులుగారి హృదయంలో నాగరాని పరితాపం గలిగింది. అమాయికయగు ఆ పల్లెటూరిపిల్ల అవ్యక్త మధురమైన మొగ మతని కన్నులకు గట్టినట్టున్నది. మళ్ళీ చూతామా అనిపించింది. బాల్యమాదిగా పెంచి తానిప్పుడు వదలుట ధర్మమా? తన వెంట తీసుక వెళ్లితే తప్పేమున్నదీ? అని అతడు తనలో తాను వితర్కించుకుంటున్నాడు. ఇంతలో రైలు కదిలింది.

పంతులుగారి పాదముల కొఱగిన లక్ష్మి అదే పాటున నె ప్రాణం వదలింది. ఆవిడ ప్రేమ ఆ వూళ్లోవాళ్లందరికీ ఆశ్చర్యమును గలిగించింది?

